www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 20 మే 2024
5
తిరుపతి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తిరుపతి అల్లర్లపై సిట్ దర్యాప్తు

- మరి కొందరి పై చర్యలు తప్పవు ఏమో?

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

సాధారణ ఎన్నికలు సందర్భంగా తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలో పోలింగ్ రోజు, ఆ మరుసటి రోజు జరిగిన అల్లర్లపై సిట్ బృందం దర్యాప్తును ప్రారంభించింది. ఘటన జరిగిన ప్రాంతాలను పరిశీలించి స్థానికులను అడిగి ఆరోజు ఏం జరిగిందో తెలుసుకున్నారు. విచారణలో వెల్లడైన విషయాలతో ఘటన సమయంలో ఉదాసీనంగా వ్యవహరించినందుకు మరికొందరిపై వేటుపడనుంది?

ఈనెల 13వ తేదీ పోలింగ్ రోజు రాత్రి చంద్రగిరి నియోజకవర్గంలోని రామిరెడ్డిపల్లి పంచాయతీ కూచువారిపల్లిలో వైసిపి అభ్యర్థి మోహిత్ రెడ్డిని టిడిపి వర్గీయులు అడ్డగించి, దాడికి పాల్పడి ఓ కారును దగ్ధం చేసి మరో కారును ధ్వంసం చేశారు. అనంతరం వైసీపీ సర్పంచి చంద్రశేఖర్ రెడ్డి ఇంటిపై పెట్రోల్ బాంబులు వేసి దగ్ధం చేశారు. అడ్డొచ్చిన అతన్ని వారి కుటుంబ సభ్యుల్ని చావబాదారు. స్థానికులపై సైతం దాడికి తెగబడ్డారు. పోలింగ్ మరుసటి రోజు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వద్ద ఉన్న ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ ప్రాంగణంలో వైసిపి నాయకులు టిడిపి అభ్యర్థి పులివర్తి నానిపై ఇసుప రాడ్లు, కర్రలు, సమ్మెటలు, బీరు బాటిల్స్‌తో దాడి చేసి, అతని గన్‌మెన్‌ని గాయపరిచారు. నాని పై సైతం దాడి చేశారు. యూనివర్శిటీ ప్రాంగణం మొత్తం బీభత్సం సృష్టించారు. దీంతో స్థానికులు సైతం భయాందోళనకు గురై పరుగులు తీశారు. అదేరోజు సాయంత్రం వర్సిటీ ప్రాంగణంలో వైసీపీ నాయకులను సైతం టిడిపి నాయకులు చావుబాదిన విషయం విధితమే. ఈ ఘటనపై కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్ కావడంతో రాష్ట్ర సిఎస్, డిజిపి వివరణతో ఎస్పి, డిఎస్పి, సీఐలను బదిలీ చేసి శాఖాపరమైన విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే.. అందులో భాగంగా ఏర్పాటైన సిట్ బృందం శనివారం రాత్రి తిరుపతికి చేరుకొని, ఆదివారం ఉదయాన్నే విచారణ ప్రారంభించింది. డీఎస్పీ రవి మనోహరాచారి నేతృత్వంలో సీఐ ప్రభాకర్ రెడ్డి, మరి కొంతమంది సిబ్బందితో కూడిన బృందం తిరపతి ఎస్వీయూ క్యాంపస్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని, మహిళ యూనివర్సిటీలో జరిగిన గొడవలపై, పోలీసుల వద్ద ఉన్న సమాచారాన్ని సేకరించారు. ఈ ఘటనపై పోలీసులు నమోదు చేసిన కేసులు సెక్షన్ల వివరాలను పరిశీలించారు.

ఎస్వీయూ పోలీసు స్టేషన్‌లో కేసు వివరాలను పరిశీలిస్తున్న సిట్ బృందం

కూచువారిపల్లిలో దగ్ధమైన వైసిపి సర్పంచ్ ఇంటిని పరిశీలిస్తున్న సిట్ బృందం

అనంతరం అక్కడి నుంచి చంద్రగిరి నియోజకవర్గంలోని రామిరెడ్డి గారి పంచాయతీ కూచువారిపల్లికి చేరుకుని, పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించి, అక్కడ సిబ్బందిని ప్రశ్నించారు, అక్కడ నుంచి కూచువారుపల్లి రామిరెడ్డిపల్లికి చేరుకొని ఆ రోజు జరిగిన అల్లర్ల పై స్థానికులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు చెప్పిన వివరాలు, పోలీసుల వద్దనున్న వివరాలను పరిశీలించారు. మరికొన్ని ప్రాంతాలను సందర్శించి, ఇంకొంత వివరాలు సేకరించి తమ నివేదికను సిట్ బృందం రేపటికల్లా (సోమవారం) ఉన్నతాధికారులకు అందించనున్నట్లు సమాచారం.

ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన హర్షవర్ధన్ రాజు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

తిరుపతి జిల్లా ఎస్పీగా హర్షవర్ధన్ రాజు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. తిరుపతి జిల్లా ఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్న కృష్ణకాంత్ పాటిల్‌ను ఇటీవల బదిలీ చేశారు. ఆయన స్థానంలో కేంద్ర సర్వీసులు విధులు నిర్వహిస్తున్న హర్షవర్ధన్ రాజును కేంద్ర ఎన్నికల సంఘం స్వయంగా చొరవ చూపి నియమించిన విషయం విధితమే. ఈ మేరకు ఆదివారం సాయంత్రం తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టి విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో శాంతిభద్రతలను అదుపులో ఉంచి, ప్రజలకు భద్రత కల్పించడంలో తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పోలీసు అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

టిడిపివి కుట్ర పూరిత ఆరోపణలు

- పచ్చ పత్రికలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయి ..
- ఐదేళ్లుగా ప్రజలకు సంక్షేమ అభివృద్ధిని అందించాం..
- 4న ఫలితాలు తర్వాత టిడిపి నేతలు ముఖాలు చూడాలి ..
- టిడిపిపై మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఘాటు వ్యాఖ్యలు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

టీడీపీవి కుట్రపూరిత ఆరోపణలు చేస్తే వాటిని పచ్చ పత్రికలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మండిపడ్డారు. తిరుపతి మారుతినగర్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన మీడియా సమావేశంలో మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఐదేళ్ళుగా ప్రజలకు సంక్షేమ అభివృద్ధిని అందించాం అందుకే ఈ దఫా పోలింగ్ శాతం పెరిగిందని ధీమా వ్యక్తం చేశారు. లోకేష్ ఎక్స్‌లో తమపై తప్పుడు పోస్టులు పెడుతున్నాడని, నారా లోకేశ్ లాంటి మూర్ఖులకు బుద్ధి తక్కువ మాటలు ఎక్కువని, అందుకే లోకేష్‌ను పప్పు అనేది అని ఎద్దేవా చేశారు. దేవినేని ఉమామహేశ్వరరావు ఐదేళ్ళుగా ఇరిగేషన్ మంత్రిగా పనిచేసి సీటు తెచ్చుకోలేక పోయయని, ఎమ్మెల్యే సీటు తెచ్చుకోలేని వ్యక్తి కూడా మాట్లాడుతుడాని అన్నారు. 2013 నుంచి ఆఫ్రికాలో తాము వ్యాపారం చేస్తున్నామని, వాహనాలు తరలిస్తోంది అక్కడికే అని, వ్యాపారాలు చేసుకుంటూ రాజకీయాల్లో ఉన్నామని, విదేశాలకు పారిపోతున్నామంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. బీజేపీ నాయకురాలు పురంధేశ్వరికి హైదరాబాద్ లో ఓటు ఉంది. చంద్రబాబుకు హైదరాబాద్‌లో ఓటు పెట్టుకుని ఇక్కడ రాజకీయం చేస్తున్నారని అనానరు. తాను విద్యార్థి దశ నుంచి విద్యార్థి విభాగం నాయకుడిగా చంద్రబాబుకి పోటీగా నిలబడ్డానని తెలిపారు. జూన్ 4వతేదీ ఎన్నికలు ఫలితాలు తర్వాత టిడిపి నాయకులు ఎక్కడ ముఖాలు పెట్టుకుంటారో చూడాలని వుందని అన్నారు. పోలింగ్ శాతం పెరగడానికి మహిళలే కారణమని, ఐ ప్యాక్ టీం కూడా ఇదే చెప్పిందన్నారు. అందరి కృషి వల్లే తాము ఎక్కువ సీట్లు సాధించి విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు ఒత్తిడి వల్లే ఘర్షణలకు కారణమని ఆరోపించారు.

స్ట్రాంగ్ రూములను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి- క్యాంపస్: జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజుతో కలిసి శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను, స్ట్రాంగ్ గ్రూప్ వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లను ఆదివారం సాయంత్రం పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద ప్రస్తుతం అమలులో ఉన్న భద్రతాపరమైన ఏర్పాట్లను సమీక్షించి, తగిన సూచనలు సలహాలు చేశారు. అనంతరం విధి నిర్వహణలో ఉన్న భద్రతా సిబ్బందితో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, ఏమైనా అనుమానాస్పదంగా అనిపించిన వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని దిశా నిర్దేశం చేశారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు పరిపాలన, కులశేఖర్ శాంతిభద్రతలు, శ్రీనివాసరావు సాయుధ దళం, డిఎస్పీ రవీంద్రారెడ్డి ఏఆర్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

- తిరుమలలో కొనసాగుతున్న యాత్రికుల రద్దీ - టీటీడీ విస్తృత ఏర్పాట్లు

క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో గత మూడు రోజులుగా భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం కూడా ఔటర్ రింగ్ రోడ్డులోని అక్టోపస్ వద్ద నుండి క్యూలైన్లు కొనసాగుతున్నాయి. వేసవి సెలవులతో పాటు వారాంతపు రద్దీతో దేశం నలుమూలల నుండి వచ్చిన భక్తులతో తిరుమల పోటెత్తింది. దేశవ్యాప్తంగా విద్యార్థులకు దాదాపు అన్ని పరీక్షలు పూర్తయినందున సాధారణంగా మే నెలలో అధిక రద్దీ ఉంటుంది. ఇందులో భాగంగా వేసవి సెలవుల రద్దీ శుక్ర, శని, ఆదివారాలలో గరిష్ట స్థాయికి చేరుకుంది. టిటిడి ఈవో ఏవి ధర్మారెడ్డి ఆదేశాల మేరకు, జేఈవో వీరబ్రహ్మం ఆధ్వర్యంలో ఇంజినీరింగ్, ఆరోగ్యం, అన్నప్రసాదం, విజిలెన్స్, వైద్యశాఖల ఉన్నతాధికారులు భక్తుల సౌకర్యాలను, క్యూలైన్లను నిరంతరాయంగా పర్యవేక్షిస్తున్నారు. మాతశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం, తిరుమలలోని అన్నప్రసాద కౌంటర్లు, నారాయణగిరి ఉద్యానవనాలలో పాటు భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలలో ఆహారం, పాలు, తాగునీరు అందించేందుకు టీటీడీ విస్తతమైన ఏర్పాట్లు చేసింది. శ్రీవారి సేవకులు అన్నప్రసాదం, ఆరోగ్య, విజిలెన్స్ విభాగాలపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని కీలక ప్రదేశాల్లో దాదాపు 1500 మంది 24/7 సేవలందిస్తున్నారు. కృష్ణతేజ సర్కిల్ వరకు వివిధ ప్రాంతాలలో నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు పంపిణీ చేస్తున్నారు. వైద్య బృందాలు బ్యాటరీ వాహనాల ద్వారా భక్తులకు అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను సరఫరా చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం 5 గంటల నివేదికల ప్రకారం ఆక్టోపస్ సర్కిల్‌లో లైన్‌లోకి ప్రవేశించే భక్తులకు దాదాపు 24 గంటల సమయం పడుతోంది.

వేషాలమ్మ గుడికి ఆర్ఓ ప్లాంట్ వితరణ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: స్థానిక వేషాలమ్మ గుడికి ఆర్వో ప్లాంటును భక్తుల తాగునీటి సౌకర్యార్థం సాయిసుధా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ రాళ్లపల్లి సుధారాణి దంపతులు ఆదివారం ఆలయ పూజారి శ్రీనివాసులుకు అందజేసి ఆర్వో ప్లాంటును ప్రారంభించారు. డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గంగ జాతర సందర్భంగా అమ్మవారి ఆలయానికి విరాళంగా అందజేయడం జరుగుతున్నదని గుర్తు చేశారు. రోజురోజుకు పెరుగుతున్న భక్తుల తాకిడికి తాగునీటి సౌకర్యార్థం ఆర్వో ప్లాంట్ ఇస్తే భక్తులకు ఉపయోగకరంగా ఉంటుందని అందజేసినట్లు తెలిపారు. ఆలయాధికారులు అమ్మవారిదర్శన ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ బద్దెల సుకుమార్, కుమారుడు అభి, ఆలయ పూజారి శ్రీనివాసులు, పాల్గొన్నారు.

సుందరయ్య స్ఫూర్తితో ఉద్యమాలకు శ్రీకారం

తిరుపతిలో..

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో భవిష్యత్తు ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య పిలుపునిచ్చారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్లో ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తదనంతరం పుల్లయ్య మాట్లాడుతూ సుందరయ్య జీవితం నేటితరం కమ్యూనిస్టులకు ఆదర్శప్రాయమన్నారు. దక్షిణాదిన తొలితరం కమ్యూనిస్టు యోధుడిగా పేదల పక్షాల ఆయన చేసిన పోరాటాలు అనిర్వచణీయమని కొనియాడారు. సుందరయ్య పోరాట ప్రతిమను ఆదర్శంగా తీసుకొని నేటితరం కమ్యూనిస్టులు స్వార్థ రాజకీయాలపై ఉద్యమ జెండా ఎగరేసేందుకు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పట్టణ కార్యదర్శి గంధం మణి, పెనగడం గురవయ్య, రెడ్డిపల్లి సురేష్, బాలకృష్ణ, గెడి వేణు, అన్వర్ బాషా, కుమార్, వెంకటేష్, రాజా తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి టౌన్: పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి ఆదివారం యశోదనగర్‌లోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశానికి రాష్ట్రానికి నేడు సుందరయ్య స్ఫూర్తిదాయక విధానాల ఆవశ్యకత పెరిగిందన్నారు. సిపిఎం నాయకులు జయచంద్ర, భగత్, సాయిలక్ష్మీ, మాధవ్, కె.వేణుగోపాల్, బుజ్జి, ఎండి శ్రీనివాసులు, మల్లిఖార్జున కావు, రవి పాల్గొన్నారు. అలాగే కొర్లగుంట, మారుతినగర్‌లో సిపిఎం నగర కార్యదర్శి టి. సుబ్రమణ్యం, కమిటీ సభ్యులు జివి.రమణ యాదవ్ ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతి సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు.

గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని మార్కెట్ సెంటర్, శివాలయం సెంటర్, వాటర్ ట్యాంక్ సెంటర్, జక్కా వెంకయ్య శ్రామిక నగర్, పుచ్చలపల్లి సుందరయ్య కాలనీల్లో సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మజ్జిగ, చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. సిపిఎం సెంట్రల్ శాఖా కార్యదర్శి జోగి శివకుమార్, సిఐటియు పట్టణ కార్యదర్శి సురేష్, మధు, నాయకులు పుట్టా శంకరయ్య, బివి.రమణయ్య, టి.వెంకట రామిరెడ్డి, అడపాల ప్రసాద్ పాల్గొన్నారు. కెవిబిపురం మండలంలో మండల కార్యదర్శి నాగరాజు సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కన్నెమ్మ, దేశమ్మ, నాగయ్య, లక్ష్మయ్య, నాగమ్మ, వరలక్ష్మీ పాల్గొన్నారు.

గూడూరులో..

ఓజిలి: పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని ప్రధాని కూడలి వద్ద సిఐటియు, ఆటో, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో షేక్ మహబూబ్ బాషా, ఓజిలి భాస్కర్, నూరు కాలేషా, జంషీద్ అహ్మద్, దాసరి సాయి ప్రసాద్, శ్రీనివాసులు, గౌతమ్ కృష్ణ పాల్గొన్నారు.

ఓజిలిలో..

సత్యవేడు: పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా సిపిఎం ఇన్‌ఛార్జి దాసరి జనార్ధన్ ఆధ్వర్యంలో ఆదివారం పేరడం గ్రామంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఎర్రజెండాను ఎగురవేసి విప్లవం వందనంతో ఘననివాళి అర్పించారు. కార్యక్రమంలో మునుస్వామి, కృష్ణయ్య, సెల్వం, సుశీల, చంద్రయ్య, రవి పాల్గొన్నారు. అలాగే పాకాలలో సిపిఎం సీనియర్ నాయకులు మధుసూదన్ రావు ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా పూలమాల వేసి నివాళి అర్పించారు. కెవిపిఎస్ నాయకులు రవి, ప్రసాద్, బాబు, హరి ప్రకాష్ పాల్గొన్నారు.

సత్యవేడులో..

బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రమైన బుచ్చినాయుడు కండ్రికలో సిపిఎం సత్యవేడు ఇన్‌ఛార్జి దాసరి జనార్ధన్ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. నలుగురి రమణయ్య, తిరుపాల్, సుబ్బయ్య, జెకె రమణయ్య పాల్గొన్నారు.

నాయుడుపేట: నాయుడుపేట సిఐటియు కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ముని రాజా, సిపిఎం పార్టీ కార్యదర్శి శివకవి ముకుందా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పద్మమ్మ, గిరిజన సంఘం నాయకులు మణెమ్మ, డివైఎఫ్ఐ నాయకులు ప్రతాప్ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో..

వెంకటగిరి: పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని పురస్కరించుకుని సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో వెంకటగిరి పట్టణంలోని పాత తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో మజ్జిగ చలివేంద్రను ఏర్పాటు చేసి ప్రజలకు పంపిణీ చేశారు. సిపిఎం జిల్లా నాయకురాలు ఆర్.లక్ష్మీ సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వెంకటగిరి ఏరియా ఇన్చార్జ్ వడ్డీపల్లి చెంగయ్య పాల్గొన్నారు.

వెంకటగిరిలో..

రేణిగుంట: సుందరయ్య వర్ధంతి సందర్భంగా రేణిగుంటలోని సిపిఎం కార్యాలయం, తారక రామనగర్‌లో సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, దిలీప్ బాషా, సెల్వరాజ్, కుప్పస్వామి, ఈశ్వరమ్మ, సత్యశ్రీ, రాజశేఖర్, శివానందం, చీరాలయ్య, మండల కార్యదర్శి హరినాథ్ పాల్గొన్నారు.

రేణిగుంటలో..

అంబరాన్ని అంటిన గంగమ్మ జాతర ఉత్సవాలు

- వైభవోపేతంగా శోభాయాత్ర
- ఆకట్టుకున్న కళా ప్రదర్శన

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్

గంగమ్మ తల్లి జాతర ఉత్సవాలు అంబరాన్ని అంటుతున్నాయి. జాతరలో భాగంగా టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం వైభవోపేతంగా శోభాయాత్ర నిర్వహించారు. తిరుపతి తొలి గడప అయిన అనంత వీధి నుంచి ప్రారంభమైన యాత్ర పట్నాలు వీధి, రామచంద్ర పుష్కరిణి, ప్రకాశం రోడ్డు, కృష్ణాపురం ఠాణా, గాంధీ రోడ్డు, బండ్ల వీధి ప్రాంతాల నుంచి గంగమ్మ ఆలయం వరకు కొనసాగింది. భక్తులు తమ భక్తి విశ్వాసాలు చాటుతూ, గంగానది ప్రవాహంలా పరవళ్లు తొక్కారు. జాతర ఉత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక భక్తి చైతన్య యాత్రను నిర్వహించే సంప్రదాయం గతకొంత కాలంగా కొనసాగుతోంది. ఇదే క్రమంలో స్థానిక అనంతవీధిలో గంగమ్మ తల్లికి భూమన కరుణాకర రెడ్డి ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో భక్తులు గంధం కుంకుమ బొట్లు పెట్టుకుని, వేపాకు ధరించి మాతంగి వేషంతో పాటు పౌరాణిక వేషధారణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాత్ర ఆద్యంతం భక్తులు పసుపు నీళ్ల కుమ్మరిస్తూ, కర్పూర హారతులిస్తూ స్వాగతించారు. నవదుర్గలు,

తప్పెటగుళ్ళు, డప్పులు, తీన్ మార్, కీలు గుర్రాలు, కొమ్ము కొయ్య, దింసా, పగటి వేషగాళ్లు, పులి వేషాలు, గరగల్లు, బోనాల కళా ప్రదర్శనలు ఆకర్షించాయి. టీటీడీ చైర్మన్ భూమన మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణం తర్వాత గంగమ్మ తల్లి జాతర అంగరంగ వైభవంగా జరుగుతోందని, గంగమ్మ తల్లి ఆలయాన్ని మరింత తీర్చిద్దడానికి అమ్మ భక్తులుగా ఎళ్లవేళలా కృషి చేస్తామని అన్నారు. భవిష్యత్‌లో మరింత గొప్పగా జాతర నిర్వహిస్తామని, గత మూడు సంవత్సరాలుగా శోభాయాత్రలో పెద్దఎత్తున భక్తులు పాల్గొంటూ భక్తి ప్రపత్తులు చాటుతున్నారని అన్నారు. జాతరలో ఐదవ రోజైన ఆదివారం భక్తులతో ఆలయం, ఊరు అంతా కిటకిటలాడడం జరిగిందన్నారు. భక్తులు అనేక రూపాల్లో విచ్చేస్తూ గంగమ్మ నామ స్మరణ చేస్తూ తిరుపతి పురవీధులు మారు మోగించారు. మేయర్ శిరీష పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లపై సమీక్షించిన కమిషనర్

తిరుపతి టౌన్: తిరుపతి శ్రీ తాతయ్యగుంట గంగమ్మ జాతర ఏర్పాట్లపై తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగినచర్యలు తీసుకుంట్టున్నట్లు తెలిపారు. క్యూలైన్ల నిర్వహణ పక్కాగా వుండాలన్నారు. ఆలయపరిసర ప్రాంతాలు, చుట్టుపక్కల పారిశుధ్యం మెరుగు కోసం చర్యలు చేపట్టామని, బ్లీచింగ్ చల్లిస్తున్నామని, ఆలయం లోపల అత్యవసర మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఆలయ పరిసరాల్లో భక్తులకు తాగునీరు ఏర్పాట్లు చేయిస్తున్నామని, లైటింగ్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకుంట్టున్నామని వివరించారు. రహదారులపై ఆక్రమణలను తొలగించామని, మంగళవారం జరిగే జాతరకు ప్రజలందరూ సహకరించాలని తెలిపారు. గంగమ్మ ఆలయ ఈవో మమత, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ఈస్ట్ పోలీస్ స్టేషన్ సిఐ మహేశ్వర్‌రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, డీఈ సంజయ్ కుమార్, శానిటరి సూపర్‌వైజర్లు చెంచెయ్య, సుమతి, ఎలక్ట్రికల్ ఏఈ నరేంద్ర పాల్గొన్నారు.

'న్యూరో సర్జరీ'తో మంచి పురోగతి

అపోలో హాస్పిటల్ డాక్టర్ ఎం. బాల మురుగన్ వెల్లడి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్



న్యూరో సర్జరీతో మంచి పురోగతి సాధిస్తున్నట్లు చెన్నై అపోలో ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ ఎన్.బాలమురుగన్ తెలిపారు. ఆదివారం తిరుపతి అపోలో క్లినిక్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రెయిన్ క్యాన్సర్ రోగులు రోడ్డు ప్రమాదాన్ని గురైన రోగులకు నరాల దెబ్బతిన్న రోగులు న్యూరో సర్జరీ ద్వారా వారికి మెరుగైన వైద్యసేవలు అపోలో ఆసుపత్రిలో అందిస్తున్నట్లు చెప్పారు. దాంతోపాటు వెన్నుముక్క దెబ్బతిన్న రోగులకు కూడా న్యూరో ఎండోస్కోప్ల రోబోటిక్ సిస్టమ్ ద్వారా వారికి చికిత్స చేసి బాగు చేయడం జరిగిందన్నారు. అలాగే న్యూరో లాజికల్‌తో మానసిక వ్యాధులకు కొత్తపద్ధతుల ద్వారా చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు. మెదడుకు సంబంధించిన న్యూరో సర్జరీలో ఎలక్ట్రోడ్‌లను చెప్పించి బ్యాటరీ అనుసంధానించి వ్యాధి లక్షణాలు నుంచి ఉపశమనం పొందేవిధంగా విద్యుత్ సంకేతాలతో మెదడులో ప్రేరేపించి చికిత్స చేస్తున్నట్టు తెలిపారు. న్యూరోకు సంబంధించిన సంబంధించిన ఆపరేషన్లు చేసి నాలుగు రోజుల్లోనే రోగులను డిశ్చార్జ్ చేయడం జరుగుతుందని చెప్పారు. న్యూరోకి సంబంధించిన వ్యాధిగ్రస్తులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

బాలారిష్టాలు దాటని హైస్కూల్ ప్లస్

- దక్కిలిలో గతేడాది అడ్మిషన్లు నిల్
- ఈ ఏడాది మరో రెండు హైస్కూల్ ప్లస్ ఏర్పాటు
- తరగతుల ప్రారంభానికి చర్యలు తీసుకుంటామన్న ఎంఈఓ

ప్రజాశక్తి-దక్కిలి: పేద, మధ్య తరగతి వర్గాలకు ఇంటర్మీడియెట్ విద్యను మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవటం లేదు. జూనియర్ కళాశాల అందుబాటులో లేక చదువులకు దూరమయ్యే పరిస్థితులు తలెత్తకూడదనే భావనతో ప్రతి మండలంలోనూ ఇంటర్మీడియెట్ విద్యను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురావాలని రెండేళ్ల క్రితం నుంచి చర్యలు చేపట్టినా వెంకటగిరి ప్రాంతంలో ఒక్క అడుగు ముందుకు పడలేదు. ముఖ్యంగా బాలికా విద్యను ప్రోత్సహించేందుకు జిల్లా పరిషత్ పాఠశాలల్లో హైస్కూల్ ప్లస్‌లను ఏర్పాటు చేసి ఇంటర్ విద్యను అందించాలనే లక్ష్యంతో దక్కిలి మండలం దగ్గవోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గతేడాదే హైస్కూల్ ప్లస్‌గా అప్ గ్రేట్ చేసినా ఒక విద్యార్థి కూడా ఇంటర్మీడియట్ విద్య కోసం దరఖాస్తు చేసుకోకపోవడం గమనార్హం. ఈ ఏడాది దక్కిలి మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు, బాలాయపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను హైస్కూల్ ప్లస్‌గా ఏర్పాటు చేశారు. జూన్ ఒకటో తేదీ నుంచి తరగతులు ప్రారంభించాలని విద్యాశాఖ సర్కులర్ సైతం జారీ చేసింది. మండలాల్లో ఇంటర్మీడియట్ విద్యను అందుబాటులోకి తీసుకురావాలని చేస్తున్న ప్రయత్నం ఏమేరకు ఫలిస్తుందో వేచి చూడాల్సిందే.

ఆదేశాలు సరే.. సౌకర్యాలేవి..

దక్కిలి, దగ్గవోలు, బాలాయపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను హైస్కూల్ ప్లస్‌గా ప్రభుత్వం మార్చింది. ఆయా మండలాల్లో జెడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు, గురుకుల పాఠశాల, ప్రైవేటు పాఠశాలల్లో సుమారు 1500మంది విద్యార్థులకు పైగా పదో తరగతి ఉత్తీర్ణత సాధించారు. హైస్కూల్ ప్లస్‌కు డిమాండ్ ఉండే అవకాశం ఉంది. కానీ అందుకు తగ్గట్టు బోధకులను నియమించడం, వసతులు కల్పించడంపై ప్రభుత్వం దృష్టిసారించడం మరిచిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఓవైపు ప్రవేశాలకు రంగం సిద్ధం చేయడం, మరో 15రోజుల్లో తరగతులు కూడా ఆరంభించేందుకు మండల విద్యాశాఖ అధికారులు సమాయత్తం అవుతున్నారు. అయితే ఉన్నతాధికారులు అధ్యాపకుల నియామకాన్ని విస్మరించారు. ఇంటర్మీడియట్ కోర్సులను బోధించేందుకు ఉన్నత పాఠశాల అధ్యాపకుల్ని కేటాయిస్తారా లేదా పిజిటి అధ్యాపకులను నియమిస్తారా అనేది ఇంకా స్పష్టత లేదు. పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ బోర్డు అధికారుల మధ్య సమన్వయం లేకనే ఇంకా స్పష్టత రాలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇక ఎంపీసీ, బైపీసీ గ్రూపులు ఏర్పాటు చేస్తే బోధనకు అనుగుణంగా ల్యాబ్‌లు ఏర్పాటు, ఇతర సౌకర్యాల కల్పనపై నేటికీ దృష్టిపెట్టలేదు. విద్యాశాఖ అధికారుల ముందుచూపు లేని నిర్ణయాలతో ఎక్కడ తమ పిల్లలకు సరైన విద్య అందదోనని తల్లిదండ్రులు.. ఆ కళాశాలలో చేర్పించేందుకు సందేహించే అవకాశం ఉందని పలువురు విద్యావేత్తలు తెలిపారు.

తరగతుల ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నాం..

2024-25 విద్యా సంవత్సరం నుంచి దక్కిలి, బాలయపల్లి మండలాల్లో మూడు ఇంటర్మీడియెట్ కళాశాలలు ఉండాలని పాఠశాల విద్య సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. ఏడాది జూన్ 1 నుంచి ఇంటర్మీడియెట్ విద్య అందుబాటులో తీసుకొస్తున్నట్లు ప్రచారం నిర్వహించి త్వరలో అడ్మిషన్లు పూర్తి చేస్తాం. - కే.వెంకటేశ్వర్లు ఎంఈవో, దక్కిలి

నానీకి బృందమ్మ పరామర్శ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: చంద్రగిరి ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి తల్లి, మాజీ మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి బొజ్జల బృందమ్మ ఆదివారం పరామర్శించారు. ఇటీవల తిరుపతి పద్మావతి మహిళా యూనివర్సిటీలోని కౌంటింగ్ స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలనకు వెళ్లిన పులివర్తి నానీపై వైసీపీ కార్యకర్తలు దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో గాయపడ్డ నానీ చికిత్స అనంతరం ఇంటి వద్ద కోలుకుంటున్నాడు. ఆయన్ను బృందమ్మ పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైసీపీ నాయకుల అరాచకాలకు త్వరలో గెలుపుతోనే బుద్ధి చెబుదామని నానికి ఆమె ధైర్యం చెప్పారు.

శాంతికి భంగం కలిగిస్తే చర్యలు: ఎస్ఐ

గ్రామస్తులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ చిరంజీవి

ప్రజాశక్తి-రామచంద్రాపురం: గ్రామాల్లో శాంతికి భంగం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని ఎస్ఐ చిరంజీవి హెచ్చరించారు. ఆదివారం మండలంలోని బ్రాహ్మణ కాలువ గ్రామంలో పోలీస్ కవాతు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా జరిగిన ఘర్షణల దృష్ట్యా పోలీసులు గాలిలో కాల్పులు జరిపిన సంఘటన చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా గ్రామాలలో హింసాత్మక ఘటనలకు ప్రజలు తావివ్వకుండా ప్రశాంత వాతావరణాన్ని కల్పించేందుకు కృషి చేయాలని అవగాహన కల్పించారు. ఎన్నికల పోలింగ్ ముగిసింది, ఫలితాలు జూన్ 4వ తారీఖున వెలువడనున్నాయి.. ఈ నేపథ్యంలో ప్రజలందరూ ఎలాంటి శాంతి భద్రతలకు విఘాతం కలిగే ప్రవర్తించరాదని హెచ్చరికలు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున శాంతి భద్రతల పరిరక్షణ కోసం మండలంలో 144సెక్షన్ అమల్లో ఉందని ఆయన గుర్తు చేశారు. హింసాత్మక ఘటనలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సురేష్, శ్రీకాంత్, రమణ, యోబు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడుల్ని ఖండిస్తున్నాం..

- ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ వెల్లడి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా జర్నిటిస్టులపై జరుగుతున్న దాడుల్ని ఖండిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆంజనేయులు వెల్లడించారు. ఆదివారం స్థానిక యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగిని జిల్లా స్థాని సమావేశానికి జిల్లా అధ్యక్షులు జి.శ్రీధర్, కార్యదర్శి వి.గోవి, మునిరాజా, దినకరన్ శ్రీనివాసులు, జయకుమార్, తులసీరామ్, మల్లెల వాణి, జయపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ జర్నలిస్టులు చిన్న, పెద్ద పత్రికలు, మీడియాల్లో పనిచేస్తున్న అందరూ సమానమే అని, ఎవరిపై దాడి జరిగినా తాము ముందుండి పోరాడుతామన్నారు. అలాగే ఆరోపణలు ఎదుర్కొంటున్న జర్నలిస్టులను విచారించి జరిగిన విషయంపై తప్పొప్పులను తెలుసుకొని న్యాయం జరిగేలా నిర్ణయం తీసుకుంటామని అన్నారు. అలాగే జర్నలిస్టులు ప్రధానంగా ఎదుర్కొంటున్న అక్రిడేషన్, హెల్త్‌కార్డు, పింఛన్లు తదితరాలు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేసే వర్కింగ్ జర్నిలిస్టులకు అందేలా పోరాటం చేయడమే ధ్యేయమన్నారు. దీనిపై నేటి నుంచి ఆగస్టు వరకు తమ ఫెడరేషన్ సభ్యత్వాలను పెంచి, ఆగస్టులో మహాసభ ఏర్పాటు చేయడానికి సన్నద్ధమవుతున్నామని పిలుపునిచ్చారు. సమావేశంలో సభ్యులు నరసింహులు, రాధాకృష్ణ, గౌస్, భాస్కర్, సుకుమార్, వెంకటేశ్వరరావు, పాటూరు సురేంద్ర, సుధీర్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలోని సి.వి.సి పార్కు నందు ముఖ్యఅతిథి వాకాటి రామ మోహన్ ద్వారా వికలాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జేవివి గత 32సంవత్సరాలుగా మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడుతూ విద్యార్థులలో సైన్స్ పట్ల అవగాహన పెంచుతూ అనేక కార్యక్రమాలు సమాజానికి ఉపయోగపడే విధంగా చేస్తుందన్నారు. గత పది సంవత్సరాల నుండి సేవా కార్యక్రమాలు కూడా చేయటం అభినందనీయం అన్నారు. ప్రతి నెల ప్రభుత్వ హాస్పిటల్‌లో గర్భిణీ స్త్రీలకు భోజనాలు పంపిణీ చేయడం, ప్రతినెల మూడవ ఆదివారం వికలాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణీ చేయడం తమ సంస్థకి ఎంతో గర్వకారణమని చెప్పారు. కార్యక్రమానికి దాతగా వ్యవహరించిన జే.వి.వి ఉపాధ్యక్షుడు రామమోహన్‌కి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, చెంచు నారాయణ, రామ మోహన్, జగదీష్, నక్క గోపి, గుర్రం విజయ్ బాబు, శ్రీనివాస్ ఆచారి, రాజేష్, పవన్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సమ్మేళన సభలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు రూరల్ మండలం పరమేశ్వర మంగళం జెడ్పీ ఉన్నత పాఠశాల 2005-2006లో చదువుకున్న విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన సభ ఆదివారం ఏర్పాటు చేసుకున్నారు. గతంలో విద్యను బోధించిన ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ 18సంవత్సరాలు గడిచిన ఇప్పటికే మమ్మల్ని గుర్తించి ఆహ్వానించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ప్రతి ఒక్కరు ఎక్కడ ఉన్నా ఏ వృత్తిలో ఉన్న మరెన్నో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఉపాధ్యాయులుగా మేమందరం సమానంగానే విద్యార్థులను చూస్తామని అందరికి ఒకేలాగనే చదువు చెప్తామని తెలిపారు. మమ్మల్ని గుర్తించే విధంగానే ఇంట్లో మీ తల్లిదండ్రులను కూడా మీ ఫ్యామిలీని కూడా చూడాలని గౌరవించాలన తెలిపారు. మిమ్మల్ని అందరిని చూడడం మీతో కలవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థి సాంబ 5ఫ్యాన్లు చేస్తామని స్వచ్ఛందంగా తెలిపారు. పాఠశాలకి ఏ అవసరం వచ్చినా ముందుండి సహకరిస్తామని విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయదేవ్, హేమలత, రోజా రాణి, సుప్రసన్న, హరిత, మహాలక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

'రచ్చబండ' ధ్వంసం

జెసిబితో ధ్వంసమైన రచ్చబండ అవశేషాలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఎంతో ఉన్నత లక్ష్యంతో ప్రభుత్వ నిధులను వెచ్చించి గ్రామీణ సాంప్రదాయాన్ని కొనసాగించడానికి నిర్మించిన ప్రజా ప్రయోజనాల ప్రభుత్వ ఆస్తి 'రచ్చబండ'ను ధ్వంసం చేసేసారు. మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీ గంగాదేవి ఎస్టీ కాలనీ ఆనుకొని ఉన్న భూమిలో చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తుడా చైర్మన్ హోదాలో మంజూరు చేసిన నిధులతో రచ్చబండను నిర్మించారు. అయితే చెన్నాయిగుంట గ్రామ లెక్క దాఖలా సర్వే నెంబర్ 70లో గల భూమిలో స్థలానికి ప్రహరీ ఏర్పాటు చేసుకునే క్రమంలో ఆ భూమికి సంబంధించిన వారు కాలువ పరంబోకు స్థలాన్ని కూడా తమ స్థలంలోకి కలుపుకోవాలని దురుద్దేశంతో అడ్డుగా వచ్చిన రచ్చబండను జెసిబి యంత్రాలతో నేలమట్టం చేసినట్టుగా స్పష్టంగా తెలుస్తోంది. అయితే ప్రభుత్వ ఆస్తిని కాపాడాల్సిన అధికారులు పట్టనట్టు ఉండడంతో పలువురు విమర్శిస్తున్నారు. పంచాయతీ పరిధిలో ప్రజల ప్రయోజనార్థం నిర్మించిన రచ్చబండను కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక కాలనీవాసులు అధికారులను డిమాండ్ చేస్తున్నారు. ఏ మేరకు రచ్చబండ తొలగింపపై అధికారులు స్పందిస్తారో వేచి చూడాలి.

వివక్షతోనే ఎన్నికల బదిలీలు

- ఎస్సీ, ఎస్టీ అధికారులే బలి అవ్వాలా?
- మాజీ ఐఏఎస్ అధికారి విజయ్ కుమార్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రంలో ఇప్పుడు జరుగుతున్న బదిలీలు వివక్షపూరితంగా జరుగుతున్నాయని మాజీ ఐఏఎస్ అధికారి, లేబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జి.ఎస్.ఆర్.కె.ఆర్ విజయ్ కుమార్ పేర్కొన్నారు. ఎన్నికల పోలింగ్ తర్వాత జరిగిన హింసలపై పోలీసు అధికారులను, కలెక్టర్, ఎస్పీలను సస్పెండ్ చేసిన నేపథ్యంపై విజయ్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. పల్నాడు కలెక్టర్ శివశంకర్‌ను మాత్రం ట్రాన్సుర్ చేశారని మిగిలిన వారిని సస్పెండ్ చేశారన్నారు. రూల్ ఆఫ్ లా ముందు అందరూ సమానమేనని, కానీ దానిలో వివక్ష చూపించడం అధికార యంత్రాంగానికి తగదన్నారు. ఎప్పుడు ఏ సంఘటన జరిగినా నోరు మెదపని బలహీనవర్గాల వారే బలవుతున్నారని, ఇప్పుడు కూడా రాష్ట్రంలో ఆ వర్గాలకు చెందిన అధికారులే బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ముగ్గురు కలెక్టర్లను మార్చారని, ఎందుకు మార్చారో కారణాలేంటో ఎవరికి తెలియదన్నారు. పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్‌ను మార్చడానికి గల కారణాలను ఎవరు పేర్కొనలేక పోతున్నారని, వివక్ష దీనికి కారణంగా భావించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఎప్పుడు ఎలాంటి సంఘటన జరిగినా దానికి ఎస్సీ, ఎస్టీ అధికారులే బలిపశువులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలక్షన్ కమిషన్ మార్చి నెలలో నలుగురు కలెక్టర్లను మార్చిందని వారిలో ముగ్గురు ఎస్సీ, ఎస్టీ అధికారులున్నారని గుర్తు చేశారు. పేదల కోసం, బలహీన వర్గాల రక్షణ కోసం లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా కలెక్టర్‌గా శివశంకర్‌ను తిరిగి కొనసాగించాలని లేదా శివశంకర్ చేసిన తప్పిదాలు ఏంటో చూపించాలని డిమాండ్ చేశారు. తిరుపతిలో కారు తగలబెడితే ఎలాంటి చర్యలు లేవని లా అండ్ ఆర్డర్ పరిస్థితులను సాకుగా చూపి ఎస్సీ, ఎస్టీ అధికారులను బలి పశువులను చేయటం మంచి పద్ధతి కాదన్నారు. గతంలో కూడా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన నివేదిక ఆధారంగా కృష్ణా జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న రాజబాబును, లక్ష్మీశా, శివశంకర్‌లను బదిలీ చేశారన్నారు. వీరి బదిలీలను తక్షణమే నిలిపివేయాలని, వారికి యధావిధి స్థానాలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. దీనిపైన లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని ప్రకటించారు.

జెడ్పిటిసి ఢిల్లీరాణి వ్యాఖ్యలు అవాస్తవం: తిరుమలరెడ్డి

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పోలింగ్ అనంతరం శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ వద్ద చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిపై జరిగింది. ముమ్మాటికి హత్యయత్న ప్రయత్నమేనని, కానీ జడ్పిటిసి సభ్యురాలు ఢిల్లీరాణి వైసిపి నేతల కార్ల ధ్వంసానికి ప్రతిదాడి మాత్రమే చేశామని చెప్పడం అవాస్తవమని రామచంద్రపురం మండలం టిడిపి అధ్యక్షులు తిరుమలరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి మండల ప్రజలు అవకాశం ఇచ్చారని, ఆయనలో వచ్చిన మార్పు కారణంగా చాలామంది వైసిపి పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారన్నారు. పోల్డ్ ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత కరువైందని, స్ట్రాంగ్ రూమును పరిశీలించడానికి వెళ్లిన క్రమంలో ప్రణాళిక ప్రకారం పులివర్తి నానిపై హత్యాయత్నం చేయడానికి ప్రయత్నించారన్నారు. కానీ అధికారులుపై అధికారులకు తప్పుడు నివేదికలు పంపడం సరికాదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఘటనలపై ఎన్నికల కమిషన్ ఆగ్రహించడంతో సిట్ ఏర్పాటు చేశారని, సిట్ అధికారులు పూర్తి సమాచారాన్ని సేకరించి ఎన్నికల కమిషన్‌కు అందించనున్నారన్నారు. ఈ హేయమైన దాడి ఘటనలో పులివర్తి నానికి న్యాయం చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఆర్‌సి పురం మాజీ టిడిపి అధ్యక్షులు నరసింహారెడ్డి, ధనంజయరెడ్డి, మునిరామిరెడ్డి, గిరిధర్ రెడ్డి, గోపీనాథ్ రెడ్డి, హరిప్రసాద్, రాజారెడ్డి, మోహన్ రెడ్డి, రంజిత్‌కుమార్ రెడ్డి, రవి, నీలకంఠం పాల్గొన్నారు.

పిడుగు పాటుకు వ్యక్తి మృతి



పిడుగుపాటుకు మృతి చెందిన అన్బుకుమార్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: రూరల్ మండలంలోని కృష్ణసముద్రం గ్రామంలో సి.అన్బు కుమార్ (45) పిడుగు పాటుకు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం మధ్యాహ్నం సుమారు 3గంటల నుంచి 4గంటల మధ్య రామసముద్రం చెరువు నందు ఆవులు మేపుచుండగా ఆకస్మాతుగా పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. నగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇతను చనిపోవడంతో దిగువ కృష్ణ సముద్రం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వైభవంగా శ్రీ సదాశివేశ్వర స్వామి కళ్యాణోత్సవం



పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి ఆర్కే రోజా

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు పట్టణంలో వెలసిన శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమానికి మంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ కొడగంటి రమేష్ బాబు ధర్మకర్తల మండలి వారు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మంత్రి ఆర్.కె. రోజా స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయంలో వేదమంత్రాలతో విశేష పూజలు నిర్వహించి వేదపండితులు ఆశీర్వచనాలు పలికారు.

సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ విజేత యాంగ్రీ ఫైటర్స్

విజేత టీంకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి-సోమల: సోమల మండలం నంజంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లే గ్రౌండ్ నందు నిర్వహించిన సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్‌లో నంజంపేట యాంగ్రీ ఫైటర్స్ జట్టు విజేతగా నిలిచింది. రన్నర్స్‌గా నంజంపేట వారియర్స్ జట్టు నిలిచింది.

ఈ టోర్నమెంట్ నందు మొత్తం ఎనిమిది టీమ్స్ పాల్గొనగా మిగిలిన అన్ని టీమ్కు ప్రోత్సాహక బహుమతులను అందించారు. ఏబీఎమ్ ఈ స్కూటర్స్ హబ్ అధినేత, నంజంపేట ఓల్డ్ స్టూడెంట్ మొగల్ అన్ను బగ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులుగా నిలిచారు. కార్యక్రమంలో అజయ్ గణేష్ హరీష్ పృధ్వి నాని చాను తదితరులు పాల్గొన్నారు.

మంటల్లో దగ్ధమైన ప్రైవేటు బస్సు

ప్రజాశక్తి-రేణిగుంట: తిరుపతి-నాయుడుపేట జాతీయ రహదారిలోని వెధల్ల చెరువు వద్ద ఆదివారం తెల్లవారుజామున హోటల్ ఉగాది వద్ద ఓ ప్రైవేటు బస్సులో మంటలు చెలరేగాయి. బెంగుళూరు నుండి అమలాపురం వెళుతుండగా బస్ టైరు పగిలి నిప్పులు రావడంతో బస్సులోనికి మంటలు వ్యాపించాయి. బస్సు వెనక వస్తున్న ఒక కారు డ్రైవర్ గమనించి బస్సు డ్రైవర్ను అప్రమత్తం చేయడంతో బస్సు పక్కకు ఆపి బస్సులోని 20మంది ప్రయాణికులు సురక్షితంగా బస్సు నుండి దింపేశారు. దీంతో ఎవరికి ఎటువంటి ప్రాణహాని జరగలేదు. అయితే బస్సులో మంటలు వ్యాపించడంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది. అనంతరం అగ్నిమాపక శాఖ వారికి సమాచారం అందించడం తో వెంటనే స్పందించిన అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటన చేరుకొని మంటలను అదుపు చేశారు. రేణిగుంట డిఎస్పి భవ్య కిషోర్ సంఘటన స్థలానికి వెళ్లి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

IN THE COURT OF PRL. CIVIL JUDGE (JUNIOR DIVISION)-CUM- JUDICIAL FIRST CLASS MAGISTRATE, PUTTUR
E.P.No. 4/2024
O.S.No. 293/2019 of Prl. J.C.J.Court, Tirupathi
BETWEEN:-
C. Praveen Kumar ......DECREE HOLDER
AND:-
K.Rama Mohan Reddy ....JUDGEMENT DEBTOR
NOTICE TO THE JUDGMENT DEBTOR:
JDR:
K. Rama Mohan Reddy.
S/o Late K. Sankar Reddy,
Contract Employee in T.T.D.,
Residing at Door No.3-27,
Nadavaluru Village and post,
Ramachandrapuram Mandal, Tirupathi Dist.
Please take notice that, the Decree Holder filed the E.P. against you for recovery of decree debt by way of arrest in respect of the E.P. schedule mentioned property and the above case is posted on 25/7/2024 for your appearance. Hence, on 25/7/2024 you may attend at 10-30 A.M. before Hon'ble court as stated supra either in person or through your advocate, failing which the matter will be decided as exparte against you.
This is the order of this Hon'ble court.
Sd/-
N. MURUGESHAN REDDY, ADVOCATE PUTTUR, Cell No.9346628144.

IN THE COURT OF ADDL. JUNIOR CIVIL JUDGE-CUM-JUDICIAL FIRST CLASS MAGISTRATE, PUTTUR
O.S.No. 342 /2022
BETWEEN:
K.A. Jayavelu ....Plaintiff.
AND:
G. Sujatha and others ....Defendants
SUMMONS TO THE DEFENDANTS No.2 to 4:
D2: G.Rajesh, S/o Late.Gadhiraju Changal Raju,
D3: G. Kalpana, Do Late. Gadhiraju Changal Raju,
D4: G. Priya, D/o Late. Gadhiraju Changal Raju,
Defendants No.2 to 4 are residing at S.B.R.Puram Village, Vadamalapeta Mandal, Tirupathi Dist., Now residing at Door No.18-7-1B, Plot No.118, Block C, Satyam Meadows Apartments, Khadi Colony, Opp: Sivashakthi Kalyana Mandapam, Tirupathi town and post, Tirupathi Urban Mandal, Tirupathi Dist., A.P.,
Please take summons that, the plaintiff filed the suit for recovery of promissory note debt against you in the above Hon'ble court and the above suit is posted to 19/06/2024 for your appearance. So, please to be attend on 19/06/2024 at 10-30 A.M. before the above Hon'ble court either in person or through your advocate, failing which the matter will be decided exparte against you on your absence.
This is the order of the above Hon'ble court.
Sd/- N. MURUGESHAN REDDY, ADVOCATE PUTTUR.